## క్లుప్తంగా

### పిచ్చిమొక్కల తొలగింపు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రెండో ఆదివారం సైతం కాలనీవాసులు శ్రమదానం చేశారు. కమ్యూనిటీ హాలు పక్కనున్న రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలు, పొదలను తొలగించారు. మురుగు కాలువలను శుభ్రం చేసి, పరిసరాలను అందంగా మార్చారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కార్యదర్శులు రాజు, సాయన్న, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

### 23న ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం

బోధన్: టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశం ఈ నెల 23న హైదరాబాద్‌లో జరుగనుందని ఆ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి విద్యాసాగర్, రాష్ట్ర కార్యదర్శి దప్పు చంద్రయ్యలు ఆదివారం తెలిపారు. టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ల నాయకత్వంలో సమావేశం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై చర్చ ఉంటుందని, రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ స్థాయి నాయకలు, ముఖ్య కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని కోరారు. స్థానిక సంఘ ప్రతినిధులు అద్దంకి లింగయ్య, నాగరాజు, సురేష్, సుధాకర్, సాయిలు, రవి, నాగోరావులు పాల్గొన్నారు.

### జీలుగ విత్తనాల పంపిణీకి సిద్ధం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని నాలుగు సొసైటీలలో 700 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి జ్యోత్స్న భవాని తెలిపారు. 30 కేజీల బస్తా ధర రూ. 2047.50 కాగా సబ్సిడీ రూ. 1564.80 పోను రూ. 840.70 చెల్లిస్తే సరిపోతుందన్నారు. జీలుగ విత్తనాలు కావాల్సిన వారు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధారు కార్డు జిరాక్స్ కాపీతో పాటు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ పర్మిట్ పొంది న పత్రాన్ని తీసుకుని సంబంధిత సొసైటీలలో జీలుగ విత్తనాలను పొందవచ్చని సూచించారు.

### రైతులను వేధించటం సరికాదు

మాక్లూర్: కొనుగోలు కేంద్రాల్లో కాంటా జరిపిన రైతుల ధాన్యం బస్తాలను రైసుమిల్లులకు తరలించకుండా వేధించటం సరికాదని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్, సంబంధిత అధికారులపై మండిపడ్డారు. ఆదివారం ఒడ్డెట్‌పల్లిలో నిల్వ ఉన్న రైతుల ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులు పడుతున్న కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తెచ్చి నెలా 15 రోజులు కావస్తున్నా కాంటాలు జరిపే నాథులు లేరన్నారు. కొన్ని చోట్ల కాంటాలు జరిపి ధాన్యం బస్తాలను నెల రోజులు కావస్తున్నా తీసుకెళ్లటం లేదన్నారు. రైతులు కల్లాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వ యంత్రాంగం స్పందించి అమ్రాద్ సొసైటీ పరిధిలో ఉన్న రైతుల ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని దుడ్డు గంగాధర్ కోరారు.

### సర్వర్‌లో సమస్య.. రైతులకు ఇక్కట్లు

- ఐదు రోజులుగా పని చేయని వైనం

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంతోపాటు మంగళపాడ్, కుర్నాపల్లి, వడ్డేపల్లి, ఠాణాకాలాన్ సబ్‌సెంటర్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా రైతులు వరిధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు అమ్మకాలు చేశారు. అమ్మిన రైతులు సొసైటీలో ఓపీఎంఎస్(ఆన్‌లైన్ ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సిస్టమ్)లో వివరాలను నమోదు చేయడానికి వెళితే ఐదు రోజులుగా సర్వర్‌లో సమస్యతో రైతులు సొసైటీల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఓపీఎంఎస్ ద్వారా రోజుకు 20 మంది రైతులకు వివరాలు నమోదు చేస్తే రైతులకు ఓటీపీ వస్తుంది. ఓపీఎంఎస్‌లో సొసైటీకి సంబంధించిన సిబ్బంది ఓటీపీ వివరాలు నమోదు చేస్తే రైతులకు మూడు రోజులలో వరిధాన్యం అమ్మిన డబ్బులు రైతుల ఖాతాలో జమవుతాయి. వడగండ్ల వానతో రైతులు ఇబ్బందులు పడగా ఇప్పుడు ఓపీఎంఎస్ సర్వర్ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఓపీఎంఎస్ సర్వర్ సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

### సీపీఎం నుంచి బహిష్కరణ

ఖలీల్ వాడి: సీపీఎం పార్టీ జిల్లా కమిటీ నాయకురాలు, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సబ్బని లతను పార్టీ నుంచి బహిష్కరించినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ఆదివారం తెలిపారు. ఇతర రాజకీయ పార్టీలోకి వెళ్లి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందున బహిష్కరించినట్లు వెల్లడించారు.

# బైపాస్ రోడ్డు వేయొద్దు

- ఇది వరకే వివిధ రకాలుగా భూములు కోల్పోయామని రైతుల ఆవేదన
- ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారినే నాలుగు లేన్లుగా మార్చాలి
- కమ్మర్‌పల్లిలోని 63వ నంబర్ జాతీయ రహదారిపై రైతుల ఆందోళన



కమ్మర్‌పల్లిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కమ్మర్‌పల్లి: 63వ నంబర్ జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణ కోసం బైపాస్ మార్గం వద్దని, ప్రస్తుతం ఉన్న రహదారినే నాలుగు లేన్లుగా విస్తరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మండల కేంద్రం పరిధిలో ఇదివరకే ఎస్సారెస్పీ వరద కాలువ, రైల్వే లైన్, హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం కాలువలు, పసుపు పరిశోధన స్థానం, మండల అధికార కార్యాలయాల కోసం వందలాది ఎకరాల తమ విలువైన భూములను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి వెడల్పు కోసం బైపాస్(గ్రీన్ హైవే) ద్వారా రోడ్డు నిర్మాణం చేపడితే మళ్లీ వందలాది ఎకరాల విలువైన పంట భూములను కోల్పోతామని ఆక్షేపించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) రూపొందించిన అలైన్‌మెంట్‌ను(గ్రామం నుంచి వెళ్లే మార్గం) గ్రామంలోని బడా వ్యాపారులు వ్యతిరేకిస్తూ, బైపాస్ రోడ్డు(గ్రీన్ హై వే) నిర్మాణాన్ని తెరపైకి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజాప్రతినిధులు, అధికారులు, సంస్థలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ రాస్తారోకోతో జాతీయ రహదారికి ఇరువైపులా కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై రాజశేఖర్ రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, రైతులు వేముల గంగారాం, కొమ్ముల రాజగంగారాం, సుంకెట రాజమల్లు, వేముల శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కల్లాలకే పరిమితమైన ధాన్యం



తొర్తిలో కల్లంలోనే ధాన్యం బస్తాలు ..



సంచులు లేకపోవడంతో కుప్పలుగా ఉన్న ధాన్యపు రాశులు

- ఏర్గట్ల మండలం తొర్తిలో 15 రోజులుగా నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు
- హమాలీలు లేకపోవడమే కారణం
- ఆందోళన చెందుతున్న రైతులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయలేక సహకార సంఘం ఉద్యోగులు చేతులెత్తేశారు. హమాలీ కార్మికులు లేకపోవడంతో 15 రోజుల నుంచి గ్రామంలో ధాన్యం తూకం వేయడం నిలిచిపోయింది. కల్లాల్లోనే ధాన్యం నిలువలు ఉండిపోయాయి. గ్రామం నలుమూలలా ధాన్యం రాశులు ఎక్కడికక్కడ ఉండిపోవడం కొనుగోళ్లకు స్పందన కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తొర్తి, ఏర్గట్ల మండలంలో ఉన్నా సహకార సంఘం మాత్రం మోర్తాడ్ మండలంలోని శెట్‌పల్లి పరిధిలో కొనసాగుతోంది. శెట్‌పల్లి సహకార సంఘం ఉద్యోగులే ఇక్కడ ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాల్సి ఉంది. గడిచిన నెల చివరి వారం నుంచి ఈ నెల మొదటి వారం వరకు అకాల వర్షాల వల్ల కొనుగోళ్లకు బ్రేక్ పడింది. ఆ తరువాత హమాలీ కార్మికులు లేకపోవడంతో కొనుగోళ్లు పూర్తిగా నిలచిపోయాయి. యాసంగి సీజనుకు గాను తొర్తిలో దాదాపు 1,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. అందరు రైతులు దొడ్డు రకాలనే సాగు చేయడంతో ఈ రకం ధాన్యంను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించనున్నారు. శెట్‌పల్లి సహకార సంఘం పరిధిలో వరి ఎక్కువగా సాగు చేసిన గ్రామం కూడా తొర్తి కావడం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

## రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



ఆర్మూర్ టౌన్: రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



కమ్మర్‌పల్లిలో..

సాక్షి నెట్‌వర్క్ : మాజీ ప్రధాన మంత్రి, కాంగ్రెస్ నేత రాజీవ్ గాంధీ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు ప్రశంసించారు. రాజీవ్ గాంధీ ఆలోచన, ముందు చూపుతోనే నేడు మన దేశం ఐటీ రంగంలో ముందంజలో ఉందన్నారు. దేశాభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమన్నారు.



బోధన్ టౌన్: కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో..

### కుంటలో దేవతల విగ్రహాలు



కరుణం కుంటలో పడేసిన దేవతల విగ్రహాలు

బోధన్‌టౌన్(బోధన్): రాకాసీపేట్‌కాలనీలోని పోచమ్మ ఆలయంలో కలపతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ప్రక్కనే గల కరుణం కుంటలో పడ వేసిన ఘటన ఆదివారం నెలకొంది. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గమనించి ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. చన్న సాయిలు, యేశాల రవీందర్, ప్రతినిధులున్నారు.

### ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం



యజ్ఞం నిర్వహిస్తున్న ఆర్యసమాజ్ ప్రతినిధులు

నవీపేట: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆర్య సమాజ్, అభ్యుదయ గ్రామీణ వికాస సంఘం ఆధ్వర్యంలో ఆదివారం యజ్ఞం నిర్వహించారు. వాతావరణంలోని కలుషిత కణాలను హరింపజేసేందుకు యజ్ఞ క్రతువు దోహదం చేస్తుందని వేద పండితులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. యజ్ఞానికి ముందు యోగాసనాలపై అవగాహన కల్పించి చేయించారు. కార్యక్రమంలో ఆర్య సమాజ్ ప్రతినిధులు వసంత్ కుమార్, సంజీవ్‌రెడ్డి, నరేంద్ర శేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పక్షుల వేదన.. అరణ్య రోదన

- పక్షులకు నిలువ నీడ కరువాయే..
- ప్రస్తుతం పంటలు లేకపోవడంతో తలదాచుకోవడానికి ఇబ్బందులు పడుతున్న పక్షులు



ముప్కాల్ మండల కేంద్ర శివారు పంట పొలాల్లో నెమళ్లు

బాల్కొండ: జాతీయ పక్షుల(నెమళ్లు) వేదన అరణ్య రోదనగా మిగులుతోంది. ఇన్నాళ్లూ పంట భూముల్లో ఏదో పంట సాగు ఉండటం వలన పంటల్లో తల దాచుకున్న జాతీయ పక్షులు ప్రస్తుతం నిలువ నీడ కూడా లేకుండా తిరుగుతున్నాయి. వనంలో ఉండాల్సిన పక్షులు జనంలోకి వచ్చి చేరుతున్నాయి. అడవులను క్రమంగా నరికి వేయడం వల్ల పక్షులకు తల దాచుకోవడానికి జాగా లేకుండ పోయింది. ఇది వరకే పలు ప్రాంతాల్లో విషపు నీరు తాగి, గుళికలు తిని అనేక జాతీయ పక్షులు మృతి చెందాయి. ప్రస్తుతం జాతీయ పక్షులకు వేటగాళ్ల నుంచి కూడా ముప్పు పొంచి ఉంది. పక్షులు ఎక్కడ తలదాచుకునే స్థలం లేక పోవడంతో వేటగాళ్లు అదనుగా భావించి జాతీయ పక్షులకు ఉరులు పెడుతున్నారు. జాతీయ పక్షులను చంపడం నేరమని తెలిసినా వదలడం లేదు. ఫారెస్ట్ అధికారులు స్పందించి పక్షులకు నీటి వసతి కల్పించాలని వన్య ప్రాణి ప్రేమికులు కోరుతున్నారు.

## ఫైలాన్‌ను పట్టించుకునే వారేరి..?



ప్రస్తుతం ఫైలాన్



శంకుస్థాపన చేసిన సమయంలో..

- పిచ్చి మొక్కలతో కళాహీనంగా కనిపిస్తున్న ఫైలాన్

బాల్కొండ: ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం శంకుస్థాపనకు నిర్మించిన ఫైలాన్‌ను పట్టించుకునే వారు లేకపోవడంతో కళావిహీనంగా మారింది. 2017 ఆగస్టు 10న ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం కోసం సీఎం కేసీఆర్ స్వయంగా ఈ ఫైలాన్ వేదికగా శంకుస్థాపన చేశారు. ఆ సమయంలో ఫైలాన్ ప్రాంగణంలో గ్రీన్ గ్రాస్, మొక్కలు పెంచారు. ఏడాది తిరగక ముందే మొక్కలు ఎండిపోయాయి. ప్రస్తుతం ఫైలాన్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. నీరు పెట్టే వారు లేకపోవడంతో మొక్కలు, గ్రీన్ గ్రాస్ ఎండిపోయింది. ఫైలాన్ రంగు వెలిసిపోయింది. అధికారులు స్పందించి ఫైలాన్‌కు మెరుగులు దిద్దాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి

- బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల కబ్జా
- సర్వే నంబరు–1333లో హద్దుల ఏర్పాటును అడ్డుకున్న రియల్టర్లు



ఆర్డీవో కార్యాలయం వద్ద బాల్కొండ వీడీసీ సభ్యులు (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను కాపాడండి మహ ప్రభో అంటూ వీడీసీ సభ్యులు ఆర్డీవో కార్యాలయానికి తరలి వెళ్లారు. అంటే బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల కబ్జా ఎలా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. మండల కేంద్రంలోని సర్వే నంబరు–1333లో ప్రభుత్వ భూమి ఉంది. గతంలో పలు మార్లు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గుర్తించారు. కాని హద్దులు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. తాజాగా హద్దులు ఏర్పాటు చేయటానికి అధికారులు చర్యలు చేపట్టారు. కానీ హద్దుల ఏర్పాటును స్థానిక రియల్టర్లు అడ్డుకున్నారు. అసలు ప్రభుత్వ భూములపై రియల్టర్ల పెత్తనం ఏంటో అర్థం కావడం లేదు. బాల్కొండ మండల కేంద్రంలో రియల్ మోసాలు ఇది వరకు బాగానే సాగాయి. మండల కేంద్రంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో జాగా కనిపిస్తేనే పాగా వేస్తున్నారు. సర్వే నంబరు– 1333 భూమి జాతీయ రహదారి–44 పక్కన ఉంది. దీంతో గుంట స్థలం కబ్జా చేసినా లక్షల్లో దండు కోవచ్చని కొందరు పెద్దలు వేసిన పన్నాగంలో సామాన్యులు బలి అవుతున్నారు. పేదలకు స్థలం అని చూపుతు పెద్దలు పండగ చేసుకుంటున్నారు. కాసులు ఇస్తే ఒకటే స్థలాన్ని ఎంత మందికైనా అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేదంలూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్డీవో కార్యాలయానికి తరలి వెళ్లిన వీడీసీ సభ్యులు**

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు వెంటనే సరిహద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో కార్యాలయం ఆర్మూర్‌కు వీడీసీ సభ్యులు 4 రోజుల క్రితం తరలి వెళ్లారు. ప్రభుత్వ భూముల్లో సర్వే నిర్వహించి వెంటనే సరిహద్దులు ఏర్పాటు చేస్తే ప్రభుత్వ భూమికి రక్షణగా ఉంటుందని విన్నవించారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

**ప్లాట్లు ఉన్నాయని అడ్డుకున్నారు**

సర్వే నంబర్–1333లో ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేయటానికి వెళితే కొందరు ప్లాట్లు ఉన్నాయని అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమస్యను విన్నవించాం. రక్షణ కల్పిస్తే హద్దులు ఏర్పాటు చేయటానికి సిద్ధంగా ఉన్నాం.

–రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

### సమాచారం..

**దరఖాస్తుల ఆహ్వానం**

ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి, అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్ ఆదివారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీల్లో ముస్లిం మైనార్టీల నుంచి, బైపీసీలో నాన్ మైనార్టీ కోటాలో ఎస్టీలలో రెండు సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 7331170813 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

**నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం**

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు పాలక వర్గం సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

**శివాలయంలో ప్రత్యేక పూజలు**

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

### ‘కోర్టు తీర్పును ధిక్కరించి కూల దోస్తున్నారు’

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనుల్లో తన ఇంటిని కోర్టు తీర్పును కాదని వీడీసీ వారు కూల దోస్తున్నారని గ్రామానికి చెందిన చింత భరత్ భూషణ్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఉపాధినిచ్చే ఇంటిని రోడ్డు వెడల్పులో కూలవద్దని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ వీడీసీ సభ్యులు పట్టు బట్టి తన నివాసాన్ని పాక్షికంగా కూలదోశారన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో 45 ఫీట్ల వెడల్పు ఉండాలని వీడీసీ తీర్మాణించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## బతుకమ్మ ఆడి వీవోఏల నిరసన



కోటగిరిలో బతుకమ్మ ఆడుతున్న వీవోఏలు

రుద్రూర్: కోటగిరిలో నిరవధిక సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలు ఆదివారం బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొన్ని రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుద్రూర్, మోస్రా మండల కేంద్రాల్లో సమ్మె కొనసాగించారు.




రుద్రూర్ మండల కేంద్రంలో..

### బీఆర్‌ఎస్‌లో యువకుల చేరిక



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన 30 మంది యువకులు ఆదివారం బీజేపీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నందిపేట పట్టణ అధ్యక్షులు భాస్కర్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హుస్సేన్, నాయకులు ఉల్లి సుధాకర్ గౌడ్, భజరంగ్, హుస్నోద్దీన్, రమేష్, దినేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్




**పీవీఆర్ మల్టీప్లెక్స్**

| | |
|---|---|
| స్క్రీన్-1 – | కస్టడీ – 12.20, 6.30<br>ది కేరళ స్టోరీ (తెలుగు) – 3.30<br>విరూపాక్ష – 9.40 |
| స్క్రీన్-2 – | ఫాస్ట్ ఎక్స్(తెలుగు)3డీ– 10.00, 4.00, 10.00 (ఇంగ్లీష్) 1.00, 7.00 |
| స్క్రీన్-3 – | అన్నీ మంచి శకునములే – 11.45, 3.00, 6.15, 9.30 |
| స్క్రీన్-4 – | బిచ్చగాడు2 – 12.15, 3.30, 6.45, 10.00 |

### కుమ్మన్‌పల్లిలో టీఎస్ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ పర్యటన



మాట్లాడుతున్న డైరెక్టర్ సంధ్యా రాణి

బోధన్ రూరల్ (బోధన్): కుమ్మన్ పల్లి, కొప్పర్తి క్యాంప్ గ్రామాల్లో టీఎస్ ఎన్పీడీసీఎల్(వరంగల్) డైరెక్టర్ సంధ్యా రాణి ఆదివారం పర్యటించారు. గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే పనులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, బోధన్ డీఈ ముక్తార్, ఏడీఈ బెనర్జీ, ఏఈ కల్యాణ్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.